నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 21 జూలై 2024 | HYDERABAD

ఇకపై విద్యార్థులకు డ్రగ్స్‌పై బోధన!

సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. టీచర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థుల కదలికలపై దృష్టి సారించేలా సూచనలు చేశారు. ఇకపై పాఠశాలల్లోనూ డ్రగ్స్‌పై అవగాహన కల్పించే సిలబస్‌ను రూపొందించేలా చర్యలు చేపట్టారు. అలాగే పాఠశాలలకు వంద మీటర్ల దూరంలో ఏ పాన్ డబ్బాలు ఉన్నా.. మద్యం షాపులున్నా వాటిని తొలిగించేందుకు సైతం కలెక్టర్ రిపోర్ట్ రెడీ చేశారు.

వీధి కుక్కల కట్టడికి జోనల్ స్థాయి కమిటీలు

సిటీబ్యూరో: వీధి కుక్కల దాడులు.. వాటి వల్ల జరుగుతున్న మరణాలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. పసిపిల్లల ప్రాణాలు పోతుండటంతో నివారణ చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో తగిన చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈ మేరకు యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్-2023కు అనుగుణంగా పురపాలికల స్థాయిల్లోనూ కమిటీలు వేస్తున్నది. ఇందులో భాగంగానే జోనల్ స్థాయి కమిటీలను బలోపేతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ సన్నద్ధమవుతున్నది. కమిటీ చైర్మన్‌గా సంబంధిత జోనల్ కమిషనర్, సభ్యులుగా డిప్యూటీ కమిషనర్లు, వెటర్నరీ అధికారులు, యానిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉండనున్నారు. కుక్కల విషయంలో చేయాల్సిన, చేయకూడని పనులపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధ్యక్షతన సోమవారం సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు..వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నేతలు

ప్రొటోకాల్‌కు తిలోదకాలు

నిరసన తెలిపిన కార్పొరేటర్లు

బడంగ్‌పేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు

సమావేశం వేదికపై కాంగ్రెస్ నేతలను కూర్చోబెట్టడంపై రగడ

బహిష్కరించిన బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట, జూలై 20 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.37.23 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శనివారం మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. ప్రజాభవనం ముందు మొక్కలు నాటారు. అనంతరం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రొటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ నేతలను వేదికపై కూర్చోబెట్టడంతో రగడ మొదలైంది. అధికారిక కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నేత నీరంజన్‌రెడ్డి, కందుకూరుకు చెందిన జంగారెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి తదితర కాంగ్రెస్ నేతలను వేదిక పైకి పిలిచారు. దీంతో కార్పొరేటర్ల పేర్లు పిల్వకుండా కార్యక్రమానికి సంబంధం లేని వ్యక్తులను ఎలా పిలుస్తారంటూ.. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లతో వాగ్వాదానికి దిగడమే కాకుండా.. ఇలానే చేస్తాం ఏమి చేసుకుంటారో చేసుకోమన్నారు. అయితే అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి కార్పొరేటర్లకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సమస్య జఠిలమైంది. అభివృద్ధి పనుల కార్యక్రమానికి పిలిచి అవమానించడం ఏమిటని బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రశ్నించారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు ముందే ఈ తతంగం అంతా జరగడంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఇంత గందరగోళం జరిగితే ఏం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు.

ఆర్టీసీకి రూ. 300 కోట్లు చెల్లిస్తున్నాం..

సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణానికి రూ.300 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రాయితీపై గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ చేసినట్లు చెప్పారు. ఆగస్టులో రెండో దశ రుణమాఫీ చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అభివృద్ధి పనులకు రూ.700 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవో సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో అణిచివేస్తారా..

అభివృద్ధి పనుల కార్యక్రమంలో ప్రొటోకాల్ గురించి ప్రస్తావిస్తే.. పోలీసులతో అణిచివేస్తారా అంటూ.. బీఆర్ఎస్ కార్పొరేటర్లు సూర్ణ గంటి అర్జున్, రామిడి కవితా రాంరెడ్డి, దీపిక శేఖర్ రెడ్డి, యాతం పవన్ యాదవ్, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల లలితకృష్ణ, రోణి రమేశ్, శివకుమార్, పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖలీల్ తదితరులు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలోనే ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే ఎలా.. అని వారు ప్రశ్నించారు. కార్యక్రమానికి సంబంధం లేని వ్యక్తులను వేదికపైకి ఆహ్వానించి.. చివరకు కార్పొరేటర్లను ఎలా పిలుస్తారని మండిపడ్డారు. పోలీసులను పెట్టి బయటకు గెంటివేయడం ఏమిటని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే లేకుండా అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన గోపన్‌పల్లి ఫ్లైఓవర్

శనివారం గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శంకుస్థాపన చేసి.. పనులు పూర్తి చేసి.. ప్రారంభానికి ఒత్తిడి చేసి..

ఐటీ కారిడార్‌లోని గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించి, శంకుస్థాపన చేసి, నిర్మాణం పూర్తి చేయడంతో పాటు చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ప్రారంభించేందుకు కూడా శక్తి వంచన లేకుండా కృషి చేసింది. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి 2021లో అప్పటి పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం బీఆర్ఎస్ హయాంలోనే వంతెన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధమైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఏడు నెలలైనా..ప్రారంభించకుండా తాత్సారం చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవలే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్మాణం పూర్తయిన గోపన్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించి.. వాహనదారులకు సౌకర్యాలను మెరుగుపరచాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు శనివారం ఫ్లై ఓవర్‌ను అధికారికంగా ప్రారంభించారు. - సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ)

అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

ఆక్రమిస్తుంటే ఏం చేస్తున్నారు?

అధికారులపై ఎమ్మెల్యే మాగంటి ఆగ్రహం

సారథినగర్‌లో ప్రభుత్వ స్థలాల పరిశీలన

ఎర్రగడ్డ, జూలై 20: ఎర్రగడ్డ డివిజన్ సారథినగర్‌లోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన రెవెన్యూ, బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సారథినగర్ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. రహదారి కోసం వదిలిన సుమారు రూ.కోటి విలువ చేసే స్థలాన్ని ప్లాట్ నం.30కి చెందిన వాళ్లు దర్జాగా కబ్జా చేసి.. ప్రహరీ నిర్మించుకుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. కండ్ల ముందే కబ్జా జరుగుతున్నా.. చూసీచూడనట్లు ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. సర్కారు స్థలాల పరిరక్షణ ధ్యేయంగా గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఏమయ్యాయని నిలదీశారు. అధికారుల పని తీరు ఇంత దారుణంగా ఉంటే.. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం కేటాయించిన స్థలాలు కూడా మాయమవ్వడం ఖాయమని గోపీనాథ్ అన్నారు. ప్లాట్‌నెం.30కి సంబంధించి స్థలం 214 చ.గజాలున్నట్లు ఆధారాలుండగా, 300 గజాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించిన వైనం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నదన్నారు. రెవెన్యూ, బల్దియా టౌన్ ప్లానింగ్ విభాగాల మధ్య సమన్వయం లోపించిందనటానికి సారథినగర్ ప్రభుత్వ స్థలాల ఆక్రమణ ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. గత పదేండ్లుగా ఇక్కడి ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఎన్నో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఐదారు నెలల్లోనే పరిస్థితి ఇంత దారుణంగా మారుతుందని ఊహించలేదన్నారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. సర్కారు స్థలాల అన్యాక్రాంతమై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

నిరంతరం.. అప్రమత్తం

వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు రాకుండా చర్యలు

బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సాగర్‌లోకి 1517 క్యూసెక్కుల వరద నీరు

సిటీబ్యూరో: గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తమై ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీరును తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు పనిచేస్తున్నాయని, ఈ బృందాలకు తోడుగా హైడ్రా ద్వారా 30 సీఆర్ఎంపీ, 29 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్ర పరిధిలో బాధ్యతాయుతంగా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 78 కోట్లు.. 107 జంక్షన్లు

ప్రమాదాల నివారణకు గ్రేటర్‌లో కూడళ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూడళ్ల సుందరీకరణ, వాహనాలను క్రమబద్ధీకరించడం, పాదచారులకు ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు రూ.78 కోట్ల అంచనా వ్యయంతో 107 జంక్షన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 31 కూడళ్లు పూర్తవ్వగా, 13 వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. 17 జంక్షన్లు పరిపాలన అనుమతులు రావాల్సి ఉన్నదన్నారు. 16 జంక్షన్లలో పనులు మొదలు పెట్టాల్సి ఉందన్నారు. ఎనిమిది చోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. మరో 8 చోట్ల భూసేకరణ చేయాల్సి ఉన్నదని, 14 జంక్షన్లు ఫిసిబులిటీలో లేవని కమిషనర్ పేర్కొన్నారు. సర్కిళ్ల వారీగా ప్రాధాన్యత గల జంక్షన్లను గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు.

మహంకాళి దేవాలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఎలాంటి ఆందోళన వద్దు..

హుస్సేన్‌సాగర్ నీటి నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నదని బల్దియా అధికారులు స్పష్టం చేశారు. హుస్సేన్ సాగర్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నదని, పూర్తి స్థాయి నీటి మట్టం 513.41 మీటర్లు కాగా ప్రస్తుతం 513.30 మీటర్ల మేర నీరు వచ్చి చేరిందన్నారు. గరిష్ఠంగా 514.75 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్నదని వివరించారు. ఎగువ ప్రాంతాల నుంచి సాగర్‌లోకి 1517 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువ మూసీలోకి 998 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

మూసీలోకి వెళ్తున్న సాగర్ వరద నీరు

మరో రెండ్రోజులు..

సిటీబ్యూరో: వాయుగుండం ప్రభావంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రేటర్ వ్యాప్తంగా ఎడతెరిపి వాన కురిసింది. షేక్‌పేటలో అత్యధికంగా 3.0, యూసుఫ్‌గూడలో 2.95, లంగర్ హౌస్‌లో 2.88, గాజులరామారంలో 2.80, కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో 2.58సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజులు మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు.

వర్షాకాలం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ/జూబ్లీహిల్స్ జూలై 20 : వర్షాకాలం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ క్లాస్‌రూం కాంప్లెక్స్‌లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ ఇంజినీరింగ్ అధికారులతో వర్షాకాలం విపత్తులపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్, కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి, ఎస్ ఈలు చిన్నారెడ్డి, శంకర్ హాజరయ్యారు.

ముస్తాబైన ఉజ్జయిని మహంకాళి దేవాలయం

నేటి నుంచి ఉజ్జయిని బోనాలు

సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ)/బేగంపేట : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించే మహిళల కోసం ప్రత్యేకంగా రెండు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే వీఐపీలకు ఒకటి.. సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇదిలా ఉంటే జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఆర్టీసీ 175 ప్రత్యేక బస్సులను నడుపుతున్నది. అయితే ఏదైనా కారణంతో సర్వీసులు అందుబాటులో ఉండకపోతే భక్తులు 9959226154, 9959226160 నంబర్లను సంప్రదిస్తే తక్షణమే బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాగా, ఆదివారం బోనాలు, సోమవారం రంగం (భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు, మహా హారతి ఉంటుంది.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఏర్పాట్లను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ క్రమంలో దేవాలయంలో అమ్మవారికి మంత్రి పొన్నం ప్రభాకర్, యూఎస్ కాన్సులెట్ జనరల్ జెన్నిఫర్ ఎ. లార్సన్ ప్రత్యేక పూజలు చేశారు. యూఎస్ కాన్సులెట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మహంకాళికి బోనం సమర్పించారు.

వాటా ఇచ్చుకో.. వ్యాపారం పెట్టుకో

గండిపేట కాలువ కబ్జాలమయం

ఎక్కడికక్కడ వ్యాపార కేంద్రాలు

వసూళ్ల మత్తులో జలమండలి

మణికొండ, జూలై 20 : గండిపేట చెరువు కాలువ(కాండూట్) కబ్జాలమయంగా మారడంతో ప్రమాదపుటంచున ఉన్నది. ఎక్కడపడితే అక్కడ వ్యాపార కేంద్రాలు వెలుస్తుండటంతో మురుగునీటితో కాండూట్ పూర్తిగా కలుషితమవుతున్నది. పరిరక్షించాల్సిన జలమండలి అధికారులు, సిబ్బంది కాసుల కోసం కబ్జాలను ప్రోత్సహించి.. నెలవారీ 'మామూళ్ల'కు తిలాపాపం తలాపిడికెడు అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. కోకాపేట నుంచి మణికొండ మున్సిపాలిటీ పరిధి వరకు ఉన్న గండిపేట కాలువ వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారింది. కాండూట్‌కు ఇరువైపులా వంద అడుగుల దూరం వరకు జీవో 111 అమల్లో ఉంటుందని జలమండలి అధికారులకు స్పష్టంగా తెలుసు.. అయినా.. చుట్టుపక్కల అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉంటాయి. ఇదికాదన్నట్టు కాలువపైనే పలు వ్యాపార కేంద్రాలకు స్థలాలను కేటాయించి.. కొందరు జలమండలి సిబ్బంది నెలవారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కాండూట్ పరిరక్షణ కోసం నియమించబడ్డ సిబ్బంది చిన్న వ్యాపార కేంద్రాలపై జులుం చూపుతూ ప్రతి నెలా ఒక్కో దుకాణానికి రూ.5 నుంచి 7 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఇవ్వకపోతే కాండూట్‌పై దుకాణం పెట్టొదంటూ బెదిరిస్తారని వారు వాపోతున్నారు. ఇటీవల పుప్పాలగూడ బీఆర్సీ ఎదురుగా వెలిసిన ఓ భవన నిర్మాణదారులు ఏకంగా కాండూట్‌పై టైల్స్ వేసి రహదారిని నిర్మించడంతో 'నమస్తే' దానిని వెలుగులోకి తీసుకొచ్చింది. అక్రమంగా ఏర్పాటు చేసిన టైల్స్, కాంక్రీట్‌ను తొలగించేందుకు జలమండలి సిబ్బంది అక్కడకు వెళ్తే.. ఓ ఉన్న తాధికారి ఫోన్‌చేసి.. సదరు బిల్డర్‌తో మంతనాలు జరుగుతున్నాయని, ఇప్పుడెందుకు తొలగించడం అంటూ క్షేత్రస్థాయి అధికారులకు తెలిపినట్లు తెలిసింది. రెండు రోజుల తర్వాత ఆ టైల్స్, కాంక్రీట్‌ను స్వయంగా సదరు బిల్డరే తొలగిస్తారంటూ స్థానిక అధికారులు తెలిపారు. కానీ నేటికి ఆ అక్రమ దారి అలాగే కొనసాగుతున్నది. అంతేకాకుండా మరో భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం నిర్మిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గండిపేట చెరువు నుంచి నగరానికి వచ్చే కాలువపై వెలిసిన వ్యాపారకేంద్రాలు

సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

ఇన్‌స్పెక్టర్ పురెందర్‌రెడ్డి

అమీర్‌పేట, జూలై 20 : ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురెందర్‌రెడ్డిపై వేటు పడింది. టీవీ ఆర్టిస్ట్‌గా భావిస్తున్న ఓ మహిళ ఇటీవల తన భర్త నుంచి ఎదురవుతున్న వేధింపుల విషయమై ఫిర్యాదు చేసేందుకు సనత్‌నగర్ పీఎస్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో 'అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేస్‌కి రావాలి' అంటూ ఆమెతో అసభ్యకర చాటింగ్ చేసినట్టు ఆ వివరాలను సైబరాబాద్ సీపీ దృష్టికి తీసువెళ్లారు. దీంతో సీపీ వెంటనే ఇన్‌స్పెక్టర్ పురెందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న శ్రీనివాసులు నియమితులయ్యారు.